సాక్షి
చిత్తూరు

బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



ఏఎన్‌ఎంలకు ఆక్సీమీటర్లు

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఏఎన్‌ఎంలకు పల్స్ ఆక్సీమీటర్లును డీఎంఅండ్‌హెచ్‌ఓ అందజేశారు.

- 8లో



పుత్తూరులో రూ.2 కోట్లతో పార్కు

పుత్తూరులో రూ.2 కోట్లతో అధునాతన పార్క్ నిర్మించనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు.

- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	24
తిరుపతి	35	25
తిరుమల	29	21
గూడూరు	37	27
నగరి	35	25

న్యూస్‌రీల్

నేడు పెద్దపంజాణిలో జగనన్నకు చెబుదాం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పెద్దపంజాణిలో బుధవారం జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన మంగళ వారం విలేకరులతో మాట్లాడుతూ పెద్దపంజాణి ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. అధికారులు గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

30 లోపు టెన్త్ ఫీజు చెల్లించాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 2022–23 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్ష ఫీజు ఈనెల 30 లోపు చెల్లించాలని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 30 వరకు అవకాశం ఉంటుందన్నారు. ఆ తర్వాత అక్టోబర్ 5వ తేదీ వరకు రూ.50 అపరాధ రుసుంతో, అక్టోబర్ 11వ తేదీ వరకు రూ.200 అపరాధ రుసుంతో, అక్టోబర్ 16 వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లాలోని ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్లు ఫీజులు కట్టించేలా చర్యలు చేపట్టాలన్నారు. నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని డీఈవో హెచ్చరించారు.

జ్వర బాధితులకు ప్రత్యేక బెడ్లు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో విష జ్వరాల బాధితులకు మంగళవారం ప్రత్యేక బెడ్లు ఏర్పాటు చేశారు. జ్వరాల వ్యాపితో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆస్పత్రి అధికారుల నుంచి జ్వరాల కేసులపై రాష్ట్ర ఉన్నత అధికారులు ఆరా తీశారు. రోజువారీ ఓపీ వివరాలను పంపాలని ఆదేశించారు. ఈమేరకు ప్రత్యేక బెడ్లు కేటాయించాలని సూచించారు. ఆస్పత్రి అధికారులు 40 బెడ్లను కేటాయించారు. జ్వరాల కేసులు అధికమైతే మరిన్ని బెడ్లు పెంచేలా చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ తెలిపారు.

ఎన్‌ఎంఎస్‌ఎస్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : నేషనల్‌మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు గడువు పొడిగించారని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తుకు ఈనెల 25వ తేదీ వరకు అవకాశం కల్పించారన్నారు. డిసెంబర్ 3వ తేదీ జిల్లాలోని రెవెన్యూ డివిజన్ కేంద్రాలలో పరీక్ష ఉంటుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, హాస్టళ్లు లేని ఏపీ మోడల్ స్కూళ్లలో ఈ సంవత్సరం 8 వ తరగతి చదువుతున్న విద్యార్థులు, కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3,50,000 లోపు ఉన్న వారు అర్హులని చెప్పారు. ఆదాయ, కుల, ధ్రువీకరణ పత్రాలు లేని విద్యార్థులు ఈ పరీక్షకు ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అయితే డిసెంబర్ 3న పరీక్ష జరిగే రోజుకు ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 ఫీజు చెల్లించాలని తెలిపారు. ప్రిటెండ్ నామినల్ రోల్స్, పరీక్ష రుసుం చెల్లించిన ఎస్‌బీఐ రశీదు, ధ్రువ పత్రాలను ఈనెల 28 వ తేదీలోపు సమర్పించాలన్నారు. దరఖాస్తులో ఏవైన పొరబాట్లు ఉన్నట్లెతై ఆన్‌లైన్ దరఖాస్తులు ఆపివేసిన తరువాత 3 రోజులు సంబంధిత స్కూల్ లాగిన్‌లో సరిచేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వివరాల కోసం www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని డీఈవో వెల్లడించారు.

పంటలపై ఏనుగుల దాడి



చల్లావారిపల్లెలో ధ్వంసమైన వరి పైరు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని చల్లావారిపల్లె సమీపంలోని పంట పొలాలపై సోమవారం రాత్రి ఏనుగులు విరుచుకు పడ్డాయి. వరి పంట తొక్కి నాశనం చేశాయి. రైతు సదాశివరెడ్డికి చెందిన వరి పైరు చాలా వరకు ధ్వంసమైంది. మంగళవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు ధ్వంసమై ఉండడాన్ని గుర్తించారు. పొలాలపై ఏనుగులు రాకుండా అటవీశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



పెద్దశేష వాహనంపై వైకుంఠనాథుడు

హంస వాహనంపై విద్యాప్రదాయిని (ఇన్‌సెట్) స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

ఆధ్యాత్మిక వారధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి పర్యటన ఆద్యంతం అభివృద్ధి.. ఆధ్యాత్మికం తొణికిసలాడింది. సనాతన సంప్రదాయాన్ని కొనసాగించడం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. గత ప్రభుత్వం పునాది దశలో వదిలేసిన శ్రీనివాస సేతు వంతెన ప్రారంభం నగర వాసుల్లో ఆనందం నింపింది. ఏళ్లుగా మరుగునపడ్డ టీటీడీ ఉద్యోగుల కల సాకారం కావడం తండ్రిని మించిన తనయుడు అనిపించింది. ఆధునిక సొబగులతో తీర్చిదిద్దిన వసతి సముదాయం ప్రారంభంతో జై జగన్ నినాదాలు విద్యార్థి లోకం మిన్నంటించింది. ఆపై శ్రీవారి సోదరి తాతయ్యగుంట గంగమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మొదటిసారి పట్టువస్త్రాలు సమర్పించడం ప్రాచీన సంప్రదాయాన్ని గుర్తుకు తెచ్చింది. తదనంతరం తిరుమలేశుడి బ్రహ్మోత్సవ వేళ ఆ కలియుగ వైకుంతవాసుడి దర్శనార్థం తిరుమల చేరుకోవడం.. అక్కడ పలు ప్రారంభోత్సవాల అనంతరం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడం పలువురిని ఆధ్యాత్మిక చింతనలో ముంచెత్తింది.

- తిరుపతి, తిరుమలలో పలు ప్రారంభోత్సవాల్లో సీఎం వైఎస్.జగన్
- తిరుపతి తాతయ్యగుంట, తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ
- సనాతన సంప్రదాయం కొనసాగింపు

తిరుమల/తిరుపతి తుడా/తిరుపతి సిటీ/ తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సోమ, మంగళవారం రెండు రోజుల పర్యటన ఓ వైపు అభివృద్ధి.. మరోవైపు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సాగింది. మొదట సీఎం వైఎస్.జగన్ రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా రోడ్డుమార్గన తిరుపతి మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. అక్కడ రూ.650.50 కోట్లతో 7 కి.మీ పొడవు నిర్మించిన ఆకాశవీధి- శ్రీనివాస సేతు వంతెనను ప్రారంభించారు. విద్యార్థుల కోసం రూ.37.8 కోట్లతో నిర్మించిన శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల నూతన వసతి సముదాయాన్ని ప్రారంభించారు. తర్వాత సుమారు ఏడు వేల మంది టీటీడీ ఉద్యోగుల ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఇళ్ల స్థలాల కోసం సుమారు రూ.600 కోట్లు ఖర్చుచేస్తున్నారు.



శ్రీవారి ఆలయంలో టీటీడీ డైరీని ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్.జగన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

ప్రాతఃకాల దర్శనం

మంగళవారం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతఃకాల సమయంలో తిరుమల శ్రీవారిని మరోమారు దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. సీఎంకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, వేద పండితులు తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. రెండు రోజుల పర్యటనలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇటు స్థానికులు, అటు భక్తులను పేరుపేరునా పలకరిస్తూ ఆకట్టుకున్నారు.

గంగమ్మ తల్లికి ప్రభుత్వ సారె

మార్కెట్ యార్డు నుంచి ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన తాతయ్య గుంట గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి నేరుగా రోడ్డు మార్గాన తిరుమల చేరుకున్నారు. దాతల సాహకారంతో టీటీడీ నిర్మించిన వకుళమాత, రచన అతిథి గృహాలను ప్రారంభించారు. అనంతరం బేడి ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి ఆలయ ప్రధాన అర్చకులు పరివట్టం చుట్టారు. పట్టువస్త్రాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా తిరుమల శ్రీవారికి సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు.



గంగమ్మకు సారె తీసుకెళ్తున్న సీఎం వైఎస్.జగన్



ఆధ్యాత్మిక తన్మయత్వంలో ముఖ్యమంత్రి



రామసేతు వంతెన ప్రారంభంలో సీఎం వైఎస్.జగన్, మంత్రులు



సీఎం వైఎస్.జగన్‌తో డిప్యూటీ మేయర్, తుడా చైర్మన్



ధ్వజారోహణం



చిన్నశేష వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన

కాణిపాకం..చవితి శోభితం



సోమవారం రాత్రి మూషిక వాహనంపై ఉభయ దేవేరులతో గణనాథుడు



మంగళవారం రాత్రి నెమలి వాహనంపై గణనాథుని విహారం

కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం చవితి వేడుకలు అంబరాన్నంటాయి. వేకువజామున మూలమూర్తికి ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు నిర్వహించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా అశేషంగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మంగళవారం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

- కాణిపాకంలో శాస్త్రోక్తంగా చవితి వేడుకలు
- వినాయకుని దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కాణిపాకం(యాదమరి): విఘ్నాలు తొలగించే శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆశీస్సుల కోసం కాణిపాకానికి భక్తులు పోటెత్తారు. వినాయక చవితి సందర్భంగా సోమవారం ఆలయం భక్తసంద్రమైంది. చందన అలంకారంలో ఉన్న గణనాథుని దర్శించి భక్తులు తన్మయత్వం చెందారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉచిత దర్శనం, రూ.100, రూ.150 క్యూలన్నీ నిండి పోయాయి. చంటి పిల్లలు, వృద్ధులు, వికలాంగులను ప్రత్యేక ద్వారం నుంచి దర్శనానికి అనుమతించారు. క్యూల్లో భక్తులకు తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదాలను అందజేశారు. కాణిపాకానికి చెందిన వినాయక యువజన సంఘం సభ్యులు మేళతాళాల నడుమ ఊరేగింపుగా వచ్చి పుష్పకావళ్లను సమర్పించారు. చిత్తూరు ఏఎస్పీ సుధాకర్, చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మూషిక వాహనంపై అభయం

సోమవారం రాత్రి మూషిక వాహనంపై శ్రీసిద్ధి, బుద్ధి సమేతంగా స్వామివారు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. మంగళ వాయిద్యాల నడుమ స్వామివారు విహరిస్తుండగా భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఉభయదారులు పాల్గొన్నారు.

వేడుకగా ధ్వజారోహణం

మంగళవారం ఉదయం వార్షిక బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు.



భక్తులతో నిండిన క్యూలు



మంగళవారం ఉదయం బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు



కాణిపాకంలో సోమవారం నిర్వహించిన వ్రతకల్పం పూజల్లో పాల్గొన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు

క్లుప్తంగా

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ఎస్పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మనోహర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పొలిటికల్ సైన్స్ (రాజనీతిశాస్త్రం) పోస్టు ఖాళీగా ఉందన్నారు. అభ్యర్థులకు పొలిటికల్ సైన్స్‌లో పీజీ, డిగ్రీ కలిగి ఉండాలన్నారు. సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. దరఖాస్తుతో ఈనెల 21వ తేదీ లోపు కళాశాలలో సంప్రదించాలన్నారు. వివరాలకు 94901 09077 నంబర్‌లో సంప్రదించ వచ్చని ప్రిన్సిపల్ తెలిపారు.

నేడు కూడా రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: రేషన్ సరుకుల పంపిణీని ఒకరోజు పొడిగిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. ఈనెల 18వ తేదీ వరకు 88.79 శాతం పంపిణీ పూర్తయిందన్నారు. ఇప్పటి వరకు రేషన్ సరుకులు పొందని కార్డుదారుల కోసం బుధవారం సాయంత్రం వరకు గడవు పొడిగించినట్లు పేర్కొన్నారు.

ఏఎన్‌ఎంలకు ఆక్సీమీటర్లు అందజేత

చిత్తూరు రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం డీఐఓ రవిరాజు సహకారంతో ఏఎన్‌ఎంలకు పల్స్ ఆక్సీమీటర్లు, థర్మల్‌గన్స్‌ను డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణలో భాగంగా రవిరాజు దాతలను కూడా భాగస్వామ్యం చేశారు. వారి ద్వారా పల్స్‌ఆక్సీమీటర్, థర్మల్ గన్స్ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో ఏఎన్‌కు రూ.5 వేలు విలువ చేసే పరికరాలను అందజేశారు. ఆరోగ్య సురక్ష లక్ష్యాన్ని పకడ్బందీగా నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

పుత్తూరులో రూ.2 కోట్లతో పార్కు

- రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తాం
- పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా
- రూ.34 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమి పూజ



కమ్యూనిటీ భవనానికి భూమి పూజ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా, చిత్రంలో ఆర్కే సెల్వమణి, రామ్‌ప్రసాద్‌రెడ్డి, నాయకులు

పుత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో పుత్తూరులో పలు అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయని, అందులో భాగంగానే గేట్ పుత్తూరులో రూ.2 కోట్లతో పార్కు ఏర్పాటు చేయనున్నట్లు పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా ప్రకటించారు. మంగళవారం గేట్‌పుత్తూరు గోవిందమ్మ ఆలయం వద్ద తుడా నిధులు రూ.34 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భర్త సెల్వమణితో కలిసి మంత్రి రోజా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికే పుత్తూరు పట్టణంలో రూ.1.10 కోట్లతో పార్కు నిర్మించినట్లు తెలిపారు. గేట్‌పుత్తూరు ప్రజల సౌకర్యార్థం రూ.2 కోట్లతో మరో పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. గేట్ పుత్తూరు ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్న రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి విత్ ర్యాంప్‌ను సైతం త్వరలోనే నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను సీఎం జగనన్న సహకారంతో కేంద్రానికి పంపినట్లు వివరించారు. గేట్‌పుత్తూరులో రూ.80 లక్షలతో అర్బన్ హెల్త్ సెంటర్ పనులు చురుగ్గా జరుగుతున్నాయని, రూ.1.10 లక్షలతో విద్యుత్ శ్మశాన వాటిక పనులు కూడా చివరి దశలో ఉన్నాయని, త్వరలోనే ప్రారంభించనున్నట్లు చెప్పారు. రూ.7.65 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాలను సైతం ప్రారంభించినట్లు తెలిపారు. అడిగిన ప్రతిపనిని మంజూరు చేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవల్సిన అవసరం మనందరిపై ఉందని తెలిపారు. అంతకు ముందు సెంగుంధర్ మక్కల్ నల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి, సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ కెఎల్‌ఎన్‌రెడ్డి, చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలిప్‌మొదలి, వార్డు కౌన్సిలర్ కుప్పమ్మ, సెంగుంధర్ సంఘం నాయకులు జయచంద్రన్, తిరునావక్కరుసు, సుందరం, శివశంకర్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, కౌన్సిలర్లు, నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల క్షేత్ర పాలకులకు రక్షాబంధనం



ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డికి రక్షాబంధనం కడుతున్న అర్చకులు



యాగశాలలో పూజలు

కాణిపాకం(యాదమరి): శ్రీకాణిపాకం వినాయక స్వామి 21 రోజుల బ్రహ్మోత్సవాలకు క్షేత్ర పాలకులుగా దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశుకు ప్రధాన అర్చకులు శేఖర్ గురుకుల్ రక్షాబంధనాన్ని కట్టారు. మంగళవారం రాత్రి యాగశాలలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాల మొదటి రక్షకుడిగా మూషికాసూరుడికి, తదపరి ఆలయ చైర్మన్, ఈఓకు రక్షాబంధనాన్ని కట్టారు.

బ్రహ్మోత్సవాలలో నేడు

బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు ఉంటాయి. రాత్రి బంగారు నెమలి వాహనం వాహనంపై దేవ దేవరులు తిరువీధుల్లో విహరించనున్నారు. ఆస్థాన మండపంలో కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

పరిశ్రమల స్థాపనతో ఉపాధి

- ఔత్సాహికులను ప్రోత్సహించాలి
- సమీక్షలో కలెక్టర్ షణ్మోహన్



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఆసక్తి ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఐఈపీసీ (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనతో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం కొత్తగా ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ (2023-2027)ని అమలులోకి తెచ్చిందన్నారు. పాలసీ అమలు విధానంపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, పరిశ్రమల యజమానులకు ఈనెలాఖరులోపు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వైఎస్సార్, జగనన్న బడుగు వికాసం పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. పీఎం విశ్వకర్మ రిజిస్ట్రేషన్లను పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో సింగిల్ డెస్క్ పోర్టల్‌లో జూలై ఏడో తేదీ నుంచి ఈనెల 16వ తేదీ వరకు 125 దరఖాస్తులు రాగా, 111 దరఖాస్తులను ఆమోదించినట్లు కలెక్టర్ తెలిపారు. గత కమిటీ సమావేశంలో చర్చించిన అంశాల్లో గుండ్రాజుపల్లె సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నా మన్నారు. డిస్ట్రిక్ట్ లెవల్ ప్రీ స్క్రూటినీ కోసం 91 క్లైయిమ్స్‌లకు రూ.4.41 కోట్ల సబ్సిడీ మంజూరుకు సిఫార్సు చేస్తున్నట్లు చెప్పారు.

64 పీఎంఈజీపీ యూనిట్ల మంజూరు

జిల్లా పరిశ్రమల జీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) కింద 2023-24 సంవత్సరంలో టార్గెట్ యూనిట్‌లు 104 కాగా, 64, ఏపీ ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డ్ లక్ష్యం 82కు 43 మంజూరు, విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ లక్ష్యం 58కి గానూ మూడు యూనిట్లు మంజూరు చేసినట్లు వివరించారు. అనంతరం జిల్లాలో పరిశ్రమల స్థాపనకు తీసుకుంటున్న చర్యలు, పరిశ్రమల ఏర్పాటు భూ కేటాయింపుల అంశాలపై చర్చించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నరేంద్రన్, డీపీవో లక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మీ, జిల్లా పండ్ల పరిశ్రమల సమాఖ్య కార్యదర్శి గోవర్ధన్ బాబీ, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీపై కేంద్ర బృందం సంతృప్తి



చిత్తూరులో కార్డుదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

చిత్తూరు రూరల్: జిల్లాలో రేషన్ పంపిణీ బాగుందని మంగళవారం ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కేంద్ర బృందం కితాబిచ్చింది. మంగళవారం జిల్లాలోని పెనుమూరులో ఒక రేషన్ షాపు, చిత్తూరులో రెండు షాపుల్లో బృందం తనిఖీలు నిర్వహించింది. బృందం అధికారులు జీఎన్‌శర్మ, ఎంఎల్ చింప ప్రజా పంపిణీ వివరాలపై ఆరా తీశారు. కార్డుదారులను విచారించారు. పోర్టిఫైడ్ బియ్యం ఉపయోగాలపై కార్డుదారులకు వివరించారు. రేషన్ పంపిణీ వ్యవస్థ బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎస్‌ఓ శంకరన్, మేనేజర్ మోహన్‌బాబు, ఏఎస్‌ఓ శేషాచలం రాజు పాల్గొన్నారు.

చవితి పండుగకు వచ్చి తిరిగి వెళుతూ..

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం



వెంకటాద్రి (ఫైల్)

పెద్దపంజాణి: వినాయక చవితి పండుగకు అక్క ఇంటికి వచ్చి సంతోషంగా తిరిగి వెళుతుండగా ఓ విద్యార్థిని రోడ్డు ప్రమాదం కాటేసింది. పలమనేరు–పుంగనూరు రహదారి మార్గమధ్యంలోని ముత్తుకూరు క్రాస్ సమీపంలో మంగళవారం జరిగిన ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం మేరకు.. మండలంలోని చల్లావారిపల్లెకు చెందిన సల్లాపురి కుమారుడు పి.వెంకటాద్రి(17) పలమనేరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. సోమవారం వినాయక చవితి సందర్భంగా కళాశాలకు సెలవు కావడంతో కర్ణాటక రాష్ట్రం పున్నిపల్లెలోని అక్క ఇంటికి వెళ్లాడు. మంగళవారం స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో తిరిగి వస్తుండగా ముత్తుకూరు క్రాస్ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న పాల ట్యాంకర్‌ను ఢీకొని వెంకటాద్రి అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26 నుంచి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : శ్రీసత్యసాయి సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్న వ్యాసరచన పోటీల కరపత్రాలను డీఈవో విజయేంద్రరావు ఆవిష్కరించారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదనం మాట్లాడుతూ భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విద్యా సంస్థల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో ఈనెల 26, 27, 29 తేదీల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉన్నత పాఠశాలల్లో 8 నుంచి 10 వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఆచార్య దేవోభవ అనే అంశంపై, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రకృతే ఉత్తమ గురువు, డిగ్రీ విద్యార్థులకు మానవత్వం పెంపొందించే విద్యావశ్యకత అనే అంశాలపై పోటీలు ఉంటాయని వివరించారు. ఇతర వివరాలకు 9440690137 నంబర్‌లో సంప్రదించవచ్చని మధుసూదనం కోరారు.

జాతీయ పోటీలకు వార్డు కార్యదర్శి



ప్రియాంక

చిత్తూరు అర్బన్: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న జాతీయ సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కు చిత్తూరుకు చెందిన వార్డు సచివాలయ కార్యదర్శి పి.ప్రియాంక ఎంపికయ్యారు. ఇటీవల గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌లో ప్రియాంక పరుగు పందెంలో పాల్గొన్నారు. 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెంలో ఆమె మొదటి స్థానంలో నిలిచారు. దీంతో చండీఘర్‌లో వచ్చే ఏడాది జరగనున్న జాతీయ పోటీలకు అర్హత సాధించారు. చిత్తూరులోని 18వ వార్డు సచివాలయంలో అమినిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఈమెను కమిషనర్ అరుణ అభినందించారు.

ఒడిశా కూలీ దారుణ హత్య



మృతి చెందిన లక్కీరామ్ ముర్మ

గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని ఠాణా చెక్‌పోస్టు సమీపంలోని చెర్లోపల్లె వద్ద మంగళవారం ఒరిస్సా యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. చెర్లోపల్లె వద్ద ఉన్న కావేరి గ్రానైట్స్ పరిశ్రమలో ఒడిశాకు చెందిన ఐదుగురు కూలీలుగా పనిచేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం భోజనం సమయంలో ఒడిశాకు చెందిన లక్కీరామ్‌ముర్మ, సతీష్, రాజస్థాన్‌కు చెందిన బావర్‌సింగ్ మధ్య గొడవ జరిగింది. ఆగ్రహానికి గురైన బావర్‌సింగ్ అర్ధరాత్రి లక్కీరామ్‌ముర్మ, సతీష్ నిద్రిస్తుండగా, బండలు కొట్టే సమ్మిటితో ఇరువురి తలలపై దాడి చేసి పరారీ అయ్యాడు. దీంతో వారు అపస్మారక స్థితికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం సహచర కూలీలు, స్థానికులు గుర్తించి 108 వాహనానికి సమాచారం అందించారు. వారు వచ్చి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా లక్కీరామ్ ముర్మ మార్గమధ్యంలోనే మృతి చెందాడు. సతీష్ కొన ఊపిరితో కొట్టు మిట్టాడుతుండడంతో తిరుపతి ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న జీడీ నెల్లూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. వివరాలను సేకరించి, పరారీలో ఉన్న బావర్ సింగ్ కోసం గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

వి.కోట: మండలంలో కస్తూరి నగరం వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు దుర్మరణం చెందారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని గోనుమాకులపల్లె పంచాయతీ నామాల వంకకు చెందిన రామమూర్తి (29) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వి.కోట– పలమనేరు జాతీయ రహదారిలోని కస్తూరి నగరం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈఘటనలో తీవ్రంగా గాయడిన రామమూర్తిని స్థానికుల సమాచారంతో బైరెడ్డిపల్లెకు చెందిన 108 సిబ్బంది వి.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ తలకు తీవ్రగాయాలైన ఆయనకు ప్రథమ చికిత్స అందించారు. గుర్తు తెలియని వ్యక్తిగా అడ్మిన్ చేసుకున్నారు. బంధువులు ఎవరూ లేకపోవడం, పోలీసులు సమయానికి స్పందించక పోవడంతో అతని ప్రాణాలపైకి వచ్చింది. వి.కోట మీడియా ప్రతినిధులు డీఎస్పీని సంప్రదించి పోలీసుల సహాయంతో 108లో కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలిస్తుండగా అతను మార్గమధ్యమంలో మృతి చెందాడు.

లైంగిక దాడి కేసులో టీడీపీ కార్యకర్త అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసులు

రొంపిచెర్ల: మహిళపై లైంగిక దాడి కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు కల్లూరు సీఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. సదుం మండలం బ్రాహ్మణవీధికి చెందిన ముస్లిం మహిళ (39) ఆదివారం సాయంత్రం సదుం నుంచి రొంపిచెర్లకు వచ్చి, తిరిగి రాత్రి 7 గంటల సమయంలో ఆటోలో పీలేరుకు బయలుదేరింది. పెద్దగొట్టిగల్లు పంచాయతీ బోనంవారిపల్లెకు చెందిన డ్రైవర్ గుర్రప్ప(45) (టీడీపీ కార్యకర్త) ఆటోలో మహిళ ఒక్కటే ఉందని, బండకిందపల్లె–బోనంవారిపల్లెకు మధ్యలో ఉన్న చెరువులోకి ఆటోను వేగంగా తీసుకుని వెళ్లి లైంగిక దాడి చేశాడు. ఈమేరకు ఆరోజు రాత్రే బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం నిందితుడు గుర్రప్ప బండకిందపల్లె సమీపంలో ఉండగా పోలీసులు అరెస్టు చేసి, ఆటోను సీజ్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా, జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

సీఎంకు స్వాగతం, వీడ్కోలు





ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి





మంత్రి ఆర్కే రోజా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

రేణిగుంట: తిరుపతి, తిరుమల పర్యటన నిమిత్తం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆయనకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కే.రోజా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీలు మద్దెల గురుమూర్తి, రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణచక్రవర్తి, సిపాయి సుబ్రమణ్యం, భరత్, మేరుగ మురళి, చంద్రశేఖర్ రెడ్డి, డీఐజీ అమ్మిరెడ్డి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, కోనేటి ఆదిమూలం, వరప్రసాద్‌రావు, పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, జంగాలపల్లి శ్రీనివాసులు, వెంకటే గౌడ, కొరముట్ల శ్రీనివాసులు, ఎంఎస్‌బాబు, ఏపీ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీషా, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి స్వాగతం పలికారు. అలాగే కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, తిరుపతి కమిషనర్ హరిత స్వాగతం పలికారు. అనంతరం మంగళవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి మంత్రులు, అధికారులు సాదర వీడ్కోలు పలికారు.

దారుణ హత్య.. నిందితుడి అరెస్ట్

- భూవివాదాల నేపథ్యంలో గొడవలు
- సొంత అన్న కొడుకు తలనే నరికి.. మొండెం వేరుచేశాడు

కుప్పం రూరల్: భూ వివాదంతో సొంత అన్న కొడుకును హత్యచేసిన నిందితుడిని మంగళవారం కుప్పం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శ్రీధర్ కథనం..మండలంలోని ఎర్రమన్నుగుంతలు గ్రామానికి చెందిన లేట్ రాజీ, తమ్ముడు లక్ష్మణ్ కుటుంబాల మధ్య ఆస్తుల తగాదాలు ఉన్నాయి. ఇదే విషయంలో రాజీ కుమారుడు రమేష్(39), లక్ష్మణ్ కుటుంబీకులకు నడుమ సోమవారం గొడవలు జరిగాయి. ఈ సమయంలో లక్ష్మణ్ ముందుగా సిద్ధంగా పెట్టుకున్న కత్తితో రమేష్ మెడను నరికి మొండెం నుంచి వేరు చేశాడు. దీనిపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. మంగళవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు.

నవోదయ 9వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్: జవహర్ నవోదయ విద్యాలయలో 2024 –2025 విద్యా సంవత్సరానికి 9వ తరగతిలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో 10 ఫిబ్రవరి 2024న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. విశ్వనాథ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలియచేశారు.

ఈ ప్రవేశ పరీక్షకు 20 23-2024 విద్యా సంవత్సరంలో ఏదైన ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. మ్యాథమెటిక్స్, జనరల్ సైన్స్, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టుల్లో రెండున్నర గంటల సమయంలో రాత పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేదీ 31 అక్టోబర్ 2023 అని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 86888 88802/9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చన్నారు.